క్లుప్తంగా

ఓపెన్ స్కూల్‌ను సందర్శించిన జిల్లా కోఆర్డినేటర్



పుస్తకాలు అందిస్తున్న పాపారావు

వైరా: వైరాలోని ఠాగూర్ విద్యాలయంలో నిర్వహిస్తున్న ఓపెన్ స్కూల్ స్టడీ సెంటర్‌ను ఓపెన్ స్కూల్ జిల్లా కోఆర్డినేటర్ యం.పాపారావు ఆదివారం సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. చదువు మధ్యలో మానివేసిన వారికి ఓపెన్ స్కూల్ ఒక వరం లాంటిదన్నారు. అభ్యాసకులు ప్రతి ఆదివారం తప్పనిసరిగా క్లాసులకు హాజరు కావాలన్నారు. కార్యక్రమంలో ఠాగూర్ విద్యాసంస్థల కరస్పాండెంట్ సంక్రాంతి రవికుమార్, అసిస్టెంట్ కోఆర్డినేటర్ కృష్ణారావు, కౌన్సిలర్స్ లింగారావు, నాగలక్ష్మి, మజీద్ తదితరులు పాల్గొన్నారు.

మద్యం తాగి వాహనాలు నడపొద్దు..



వాహనాలను తనిఖీ చేస్తున్న ఎస్సై కుషకుమార్

సత్తుపల్లిరూరల్: మద్యం తాగి వాహనాలు నడపరాదని సత్తుపల్లి పట్టణ ఎస్సై కుషకుమార్ అన్నారు. ఆదివారం పట్టణంలో పలు వాహనాలను తనిఖీలు నిర్వహించి జరిమానాలు విధించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మద్యం సేవించి వాహనాలు నడిపితే జరిమానాతో పాటు జైలు శిక్ష ఉంటుందన్నారు. వాహనానికి ఎటువంటి డాక్యుమెంట్లు లేకపోయినా.. మద్యం సేవించి, రాంగ్‌రూట్‌లో వాహనం నడిపినా.. రాంగ్ పార్కింగ్ చేసినా ఎట్టి పరిస్థితిలో ఉపేక్షించేది లేదని తెలిపారు. తనిఖీల్లో పోలీస్ సిబ్బంది ఎంవీ సత్యనారాయణ, నరేష్, శ్రీనివాస్, కరుణాకర్ ఉన్నారు.

రాష్ట్రస్థాయి కరాటే పోటీలు

మధిరరూరల్: మధిర పట్టణంలోని ఇండోర్ స్టేడియంలో ఆదివారం శ్రీనిధి స్కూల్, ఖమ్మం వీరన్న అకాడమీ సంయుక్త ఆధ్వర్యంలో రాష్ట్రస్థాయి కరాటే పోటీలు నిర్వహించారు. ఈ కరాటే పోటీలను శ్రీనిధి స్కూల్ కరస్పాండెంట్ బి.అంజన్ బాబు ప్రారంభించి మాట్లాడారు. పాఠశాల స్థాయి నుంచే ఆత్మ రక్షణ కోసం ఇటువంటి విద్యలను అన్ని పాఠశాలల్లో ప్రవేశపెట్టాలని కోరారు. తమ పాఠశాలలో మొదటి నుంచి కరాటే విద్యను ప్రోత్సహిస్తున్నట్లు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాల డైరెక్టర్ చందు, కరాటే మాస్టర్ వీరన్న, చంద్రశేఖర్, టోర్నమెంట్ అఫీషియల్ రెఫరీ అండ్ జడ్జి గఫూర్ తదితరులు పాల్గొన్నారు.

ప్రైవేట్ ఎలక్ట్రీషియన్ మండల కమిటీ ఎన్నిక

కొణిజర్ల: ప్రైవేట్ ఎలక్ట్రీషియన్ల సంఘం నూతన మండల కమిటీని ఆదివారం కొణిజర్లలో ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. సంఘం నూతన అధ్యక్షుడిగా చల్లా వెంకన్న, ఉపాధ్యక్షుడిగా గూడె నాగేశ్వరరావు, ప్రధాన కార్యదర్శిగా దేవర నాగరాజు, సహాయ కార్యదర్శిగా కనపర్తి కొండలరావు, కోశాధికారిగా చల్లా వీరన్న, గౌరవ సలహాదారుడిగా కొలిపాక వెంకటేశ్వర్లును ఎన్నుకున్నారు. ఈ కార్యక్రమంలో షేక్ ఘని తదితరులు పాల్గొన్నారు.

యూటీఎఫ్..

మధిర: యూటీఎఫ్ మధిర మండల కమిటీని ఆదివారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. మధిర పట్టణంలోని టీవీఎం పాఠశాలలో ఆ యూనియన్ మధిర మండల మహాసభ జరిగింది. యూటీఎఫ్ మండల నూతన అధ్యక్ష, కార్యదర్శులుగా ఏ.వినోద్‌రావు, ఈ.వీరయ్య ఎన్నికయ్యారు. ఎన్నికల అధికారిగా జి.రామకృష్ణ వ్యవహరించారు. నూతనంగా ఎన్నికైన కమిటీని యూనియన్ బాధ్యులు, ఉపాధ్యాయులు అభినందించారు.

రెబ్బవరంలో గ్రంథాలయం ప్రారంభం



గ్రంథాలయాన్ని ప్రారంభిస్తున్న దృశ్యం

వైరారూరల్: మండలంలోని రెబ్బవరం గ్రామంలో హెల్పింగ్ హ్యాండ్స్ కుటుంబ సభ్యులు, ఖమ్మంకు చెందిన విశ్రాంత కొంగర పురుషోత్తం, బిక్కసారి వెంకటరత్నమ్మల ఆర్థిక సహకారంతో బిక్కసాని నర్సయ్య, మంగమ్మల జ్ఞాపకార్థం రూ.10 లక్షల వ్యయంతో నిర్మించి గ్రంథాలయాన్ని ఆదివారం పూర్వ విద్యార్థి కొండబాల కోటేశ్వరరావు ప్రారంభించారు. విద్యార్థులు సౌకర్యార్థం గ్రంథాలయాన్ని నిర్మించిన దాతలను గ్రామస్తులు అభినందించారు. కార్యక్రమంలో సర్పంచ్ సాదం రామారావు, బిక్కసారి దామోదర్‌రావు, బిక్కసారి సీతయ్య, మోత్కూరు మధు, యలమద్ది వెంకటేశ్వర్లు, సయ్యద్, షఫీ, దాసరి దానియేలు, బత్తుల వెంకటేశ్వరరావు తదితరులున్నారు.

అనుమతి ఒకటి.. నిర్మించేదొకటి

- సత్తుపల్లిలో ఇష్టారీతిన ఇళ్ల నిర్మాణాలు
- నిబంధనలు పాటించటంలో నిర్లక్ష్యం
- నోటీసులిచ్చినా పట్టించుకోని వైనం..

సత్తుపల్లి: శరవేగంగా అభివృద్ధి చెందుతున్న సత్తుపల్లి మున్సిపాలిటీలో అడ్డగోలు నిర్మాణాలు వెలుస్తున్నాయి. నిబంధనలకు పాతరేసి ఇష్టారీతిన నిర్మాణాలు చేపడుతున్నా.. సంబంధిత అధికారులు పట్టించుకోక పోవటంతో భవన నిర్మాణ యజమానులదే అంతిమ నిర్ణయంలా పనులు జరుగుతున్నాయి. సత్తుపల్లి పట్టణంలో లెక్కకు మించి అపార్ట్‌మెంట్లు ఉన్నా.. చాలా అపార్ట్‌మెంట్లలో అక్రమ నిర్మాణాలు ఉన్నాయనే ఫిర్యాదులు ఉన్నాయి. అనుమతికి మించి బహుళ అంతస్తులు నిర్మిస్తున్నా చర్యలు తీసుకోవటంలో అధికారుల ఉదాసీనత వరంగా మారింది.

టీఎస్‌బీపాస్‌లో భవన నిర్మాణాల అనుమతులు తీసుకోవాలి. సత్తుపల్లి మున్సిపాలిటీలో కేవలం జీ+2కు మాత్రమే అనుమతి ఉంది. అంతకుమించి అనుమతి కావాలన్నా వరంగల్ రీజనల్ డైరెక్టర్ నుంచి అనుమతి పొందాల్సి ఉంటుంది. అపార్ట్‌మెంట్ల నిర్మాణాల అనుమతుల్లో తప్పనిసరిగా అగ్నిమాపకశాఖ అనుమతి తీసుకోవాల్సి ఉండగా నాలుగైదు మినహా ఏ ఒక్క అపార్ట్‌మెంట్, షాపింగ్ కాంప్లెక్స్‌కు అగ్నిమాపక శాఖ అనుమతులు లేవంటే ఎంత దారుణంగా అక్రమ నిర్మాణాలు జరుగుతున్నాయో అర్థం చేసుకోవచ్చు.

నిబంధనలకు పాతర..

జీ+2కు అనుమతులు తీసుకొని ఏకంగా జీ+5 అపార్ట్‌మెంట్లు నిర్మిస్తున్నారంటే సత్తుపల్లిలో అక్రమ నిర్మాణాలు ఏ స్థాయిలో ఉన్నాయో అర్థం చేసుకోవచ్చు. నిబంధనల ప్రకారం షెడ్‌బ్యాక్ కట్టాల్సి ఉండగా అటువంటివేమీ పట్టించుకున్నట్లు భవన నిర్మాణాలు చూస్తే అట్టే అర్థమౌతుంది. భవనం చుట్టూ రెండుమీటర్ల స్థలం వదలాల్సి ఉన్నా.. కనీస స్థలం కూడా వదలకుండా భవన నిర్మాణాలు చేపడుతున్నారు. మరికొందరు వీధి వెడల్పు కనీసం 40 అడుగులు ఉండాల్సి ఉండగా.. సత్తుపల్లి పట్టణంలోని చాలాచోట్ల వీధులపైకి నిర్మాణాలు చేస్తున్నా సంబంధితశాఖ చూసీ చూడనట్లు వ్యవహరిస్తున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. అపార్ట్‌మెంట్లు, షాపింగ్ కాంప్లెక్స్ నిర్మాణాలలోనైతే సెల్లార్లు కూడా అద్దెకు ఇచ్చుకుంటూ సొమ్ము చేసుకుంటున్నారనే ఫిర్యాదులు వస్తున్నాయి. రాజకీయ అండ చూసుకొని కొందరు అక్రమాలకు తెగబడుతున్నట్లు ప్రచారం జరుగుతుంది.

జాగ్రత్తలు పాటించాలి..

భవన నిర్మాణాల సమయంలో కనీస జాగ్రత్తల్లో భాగంగా చుట్టూ పరదాలు కట్టి పనులు చేపట్టాల్సి ఉండగా బిల్డర్లు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తుండటంతో నిర్మాణ సమయంలో పక్కన ఉన్న ఇంటి పరిసరాల వారికి దుమ్మూ, ధూళీ కాలుష్యంతో ఇబ్బంది పడుతున్నారు. పైగా చిన్నచిన్న రాళ్లుపడి ప్రమాదాలు కూడా జరుగుతున్నాయి. అదీగాక రోడ్డుపైనే భవన నిర్మాణాల సామగ్రిని వేయటం వల్ల ఇబ్బందులు పడుతున్నారు.

నోటీస్ ఇచ్చినా..

సత్తుపల్లి పట్టణం గుడిపాడురోడ్ మూలమలుపు మీద నిర్మిస్తున్న బహుళ అంతస్తుల భవనం అనుమతి జీ+2కు తీసుకొని జీ+5 నిర్మిస్తున్నారని ఫిర్యాదుతో మున్సిపల్, రెవెన్యూ, పోలీస్ సహకారంతో నోటీసులు ఇచ్చినా సంబంధిత యజమాని భవన నిర్మాణ పనులు నిలుపుదల చేయకపోవటంపట్ల విమర్శలు వినిపిస్తున్నాయి. దీంతో పాటు సత్తుపల్లి పట్టణంలో పదుల సంఖ్యలో భవన, అపార్ట్‌మెంట్ నిర్మాణాలపై ఫిర్యాదులు వెల్లువెత్తుతున్నాయి. మరికొన్ని చోట్ల రోడ్డుకు ఆనుకొని ప్రహరీ, పూల మొక్కల ఫౌంటేన్లు నిర్మించటం వల్ల వీధుల్లో కనీసం ఒక వాహనం వస్తే మరో వాహనం వెళ్లని పరిస్థితి నెలకొంది. మరికొన్ని చోట్ల కాసుల కక్కుర్తికి బహుళ అంతస్తుల ముందు రోడ్లపైనే విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్లు పెట్టడం వల్ల ఏ ప్రమాదం ముంచుకొస్తుందోనంటూ భయాందోళనలు వ్యక్తమౌతున్నాయి.



అక్రమంగా నిర్మిస్తున్న గుడిపాడురోడ్‌లోని జీ+5 నిర్మాణ భవనం (ఇన్‌సెట్) నోటీస్ అంటిస్తున్న మున్సిపల్ సిబ్బంది

కూల్చివేతకు ఆర్డర్ ఇస్తాం..



గుడిపాడులో నిర్మాణంలో ఉన్న భవనం అనుమతి జీ+2 తీసుకున్నారు. జీ+5 నిర్మిస్తుండటం పట్ల ఈ నెల 8వ తేదీన నోటీసు ఇచ్చాం. తహసీల్దార్ భవన నిర్మాణ సర్వే నంబర్‌పై నివేదిక ఇవ్వమని లేఖ పంపిం టచాం. అక్కడ నుంచి వివరాలు రాగానే చర్యలు చేపడతాం. అవసరమైతే కూల్చివేతకు ఆర్డర్ ఇస్తాం.

– కె.సుజాత, మున్సిపల్ కమిషనర్, సత్తుపల్లి

సమస్యల పరిష్కారానికి కృషి చేస్తా



ఎమ్మెల్యే రాందాస్‌నాయక్‌కు వినతిపత్రం అందిస్తున్న జర్నలిస్టులు

కారేపల్లి: జర్నలిస్టుల సమస్యల పరిష్కారానికి తన వంతు కృషి చేస్తానని వైరా ఎమ్మెల్యే మాలోత్ రాందాస్‌నాయక్ అన్నారు. కారేపల్లి మండల విలేకర్ల బృందం ఆదివారం ఎమ్మెల్యే స్వగృహం కొత్తగూడెంలో ఎమ్మెల్యేను మర్యాద పూర్వకంగా కలిసి సమస్యలతో కూడిన వినతి పత్రాన్ని అందజేశారు. ఎన్నో ఏళ్లుగా జర్నలిస్టులు ఇండ్లు, ఇళ్ల స్థలాలు ఇవ్వాలని, ప్రభుత్వ అభయహస్తం ఆరు గ్యారంటీల పథకాలలో జర్నలిస్టులకు ప్రాముఖ్యత ఇవ్వాలని కోరారు. జర్నలిస్టుల సమస్యలను సీఎం దృష్టికి తీసుకెళ్లి సమస్యల పరిష్కారం చూపుతానని హామీ ఇచ్చారు. ఎమ్మెల్యేను కలిసిన వారిలో ప్రెస్‌క్లబ్ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శి భీమవరపు శ్రీనివాసరావు, పగడాల నాగేశ్వరరావు, కోశాధికారి పాలిక శ్రీనివాస్, గౌరవ అధ్యక్షుడు ఆనంతారపు వెంకటాచారి, సహాయ కార్యదర్శి తేళ్ల శ్రీనివాసరావు, కొండపల్లి వెంకటేశ్వర్లు, దమ్మలపాటి కృష్ణ, కొత్తూరి శ్రీనివాసరావు, బానోత్ బాలు, శ్రీనివాస్, రాము, ప్రవీణ్, నరేష్ తదితరులు ఉన్నారు.

ముగిసిన క్రికెట్ టోర్నీ..

వైరా: వైరా మున్సిపాలిటీ పరిధిలోని అయ్యప్పస్వామి ఆలయం సమీపంలో సంక్రాంతి సంబురాలను పురస్కరించుకొని నిర్వహించిన రాజీవ్‌గాంధీ క్రికెట్ అసోసియేషన్ క్రికెట్ టోర్నమెంట్ ఆదివారంతో ముగిశాయి. టోర్నీలో గెలుపొందిన టీం కు ఎమ్మెల్యే మాలోత్ రాందాస్ నాయక్ బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో మాజీ మార్కెఫెడ్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు బొర్రా రాజశేఖర్, వైరా మున్సిపల్ చైర్మన్ సూతకాని జైపాల్, బీడీకే రత్నం, దార్నా రాజశేఖర్, పాదిలి హరినాథ్, మిట్టపల్లి నాగి, కౌన్సిలర్ లక్ష్మీబాయ్ తదితరులు పాల్గొన్నారు.

ముగిసిన జిల్లాస్థాయి క్రికెట్..

ఏన్కూరు: ఏన్కూరులోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో గత వారం రోజులుగా జరుగుతున్న ఉమ్మడి జిల్లాస్థాయి క్రికెట్ పోటీలు ఆదివారం ముగిసాయి. ప్రథమ బహుమతి బీఎస్‌తండ, ద్వితీయ, తృతీయ బహుమతి, నాల్గో బహుమతి తల్లాడ జట్లు గెలుచుకున్నాయి. విజేతలకు వైరా ఎమ్మెల్యే మాలోత్ రాందాస్ నాయక్ అందించారు. ఈ కార్యక్రమంలో ఎస్సై బాదావత్ రవి, కాంగ్రెస్ నాయకులు శెట్టిపల్లి వెంకటేశ్వరావు, వేముల కృష్ణప్రసాద్, స్వర్ణ నరేందర్, భూక్యా లాలు, శెట్టిపల్లి నరేష్, కూరకుల రమేష్, నర్సింహారావు, శోభన్ తదితరులు పాల్గొన్నారు.

ఓటర్ల నమోదు పరిశీలన

సత్తుపల్లిటౌన్/వేంసూరు/ముదిగొండ: మండలంలోని పోలింగ్ కేంద్రాల్లో ఆదివారం ప్రత్యేక ఓటర్ల నమోదు కార్యక్రమం నిర్వహించారు. సత్తుపల్లిలోని పలు కేంద్రాలను తహసీల్దార్ యోగేశ్వరరావు, వేంసూరులోని 26 పంచాయతీల్లో.. కల్లూరు ఆర్డీఓ అశోక్‌చక్రవర్తి, ముదిగొండ మండలంలో ఖమ్మం ఆర్డీఓ గణేష్ సందర్శించి బూత్‌లెవల్ అధికారులకు ఓటర్ల నమోదు ప్రక్రియపై సూచనలు చేశారు. వ్యక్తిగతంగా ఇచ్చిన దరఖాస్తులను మాత్రమే తీసుకోవాలని సూచించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. 18 నిండిన ప్రతి ఒక్కరూ ఓటుకు నమోదు చేసుకోవాలని సూచించారు. అదే విధంగా పట్టభద్రులు తమ ఓటు హక్కుకు దరఖాస్తు చేసుకోవాలి సూచించారు. ఓటరు కార్డులో తప్పులు సరిచేసుకోవడం కోసం దరఖాస్తు చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో తహసీల్దార్ ఎంపీ రాజు, ఆర్ఐ చిరంజీవి, నాయబ్ తహసీల్దార్ రెహమాన్, గిర్దావర్ వహిదా, బీఎల్‌ఓలు పాల్గొన్నారు.



ముదిగొండ: బీఎల్‌ఓలను వివరాలు అడుగుతున్న ఆర్డీఓ గణేష్

విజయవంతంగా బోడేపూడి వైద్య శిబిరం

వైరా: వైరాలోని బోడేపూడి విజ్ఞాన కేంద్రంలో బోడేపూడి కళానిలయం ఆధ్వర్యంలో ప్రతీ నెల 3వ ఆదివారం నిర్వహించే ఉచిత వైద్య శిబిరం ఆదివారం విజయవంతంగా నిర్వహించారు. ప్రముఖ వైద్యులు డాక్టర్ చీకటి భారవి, డాక్టర్ పిల్లలమర్రి సుబ్బారావు, డాక్టర్ జట్ల రంగారావులు వైద్యపరీక్షలు నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. వారసత్వంగా వచ్చే జబ్బులు తగిన అవగాహనతో జాగ్రత్తలు తీసుకుంటే వాటి నుంచి బయట పడవచ్చన్నారు. మనిషి ఎదుర్కొంటున్న ఒత్తిడి అనేక జబ్బులకు కారణమన్నారు. కార్యక్రమంలో బోడేపూడి కలానిలయం కార్యదర్శి బొంతు రాంబాబు, సభ్యులు తోట నాగేశ్వరరావు, మాజీ ఎంపీపీ బొంతు సమత, మాదినేని రజిని, గుడిమెట్ల మోహన్‌రావు, అనుమోలు రామారావు, ప్రసాద్, శ్రీనివాసరెడ్డి, చలపతిరావు, నారాయణరావు, సూరయ్య, ఉదయ్ పాల్గొన్నారు.

సోషలిజాన్ని ముందుకు తీసుకెళ్లాలి

వైరా/పెనుబల్లి: పీడిత ప్రజలపై జరుగుతున్న దోపిడీ విధానాలను నిర్మూలించడానికి సోషలిజాన్ని పోరాడే శక్తులకు ఆయుధంగా ఇచ్చిన మహనీయుడు.. లెనిన్ స్ఫూర్తితో పోరాటాలకు సిద్ధం కావాలని సీపీఐ ఎంఎల్ మాస్‌లైన్ రాష్ట్ర కమిటీ సభ్యుడు సీవై పుల్లయ్య, సీపీఎం జిల్లా కమిటీ సభ్యుడు చలమాల విఠల్‌రావు అన్నారు. ఆదివారం వైరాలో, పెనుబల్లిలోని సీపీఎం కార్యాలయంలో లెనిన్ శత వర్ధంతి కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు నాయకులు లెనిన్ చిత్ర పటానికి పూల మాల వేసి నివాళులు అర్పించారు. కార్యక్రమంలో పార్టీ డివిజన్ కార్యదర్శి అర్జునరావు, నాయకులు బాబు, శిరీష, లక్ష్మణ్, సోములు, శ్రీను, దర్గయ్య, రమేష్, శ్రీను, ఐలయ్య, సీపీఎం మండల కార్యదర్శి గాయం తిరుపతిరావు, నాయకులు బాబు, సత్యం, రాజేశ్వరరావు, అరుణ్‌ప్రతాప్, నాగమణి, నరసింహారావు, సీతారాములు, కొర్రయ్య తదితరులు పాల్గొన్నారు.



పెనుబల్లి: లెనిన్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న సీపీఎం నాయకులు

సీపీఐని ఆదరించండి



సీపీఐ సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న ఆదినారాయణ

తల్లాడ: ప్రజా సమస్యలపై నిరంతరం పోరాడుతున్న సీపీఐని ఆదరించాలని సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు దండు ఆదినారాయణ అన్నారు. తల్లాడలో ఆదివారం సీపీఐ సభ్యత్వ నమోదు ప్రారంభం సందర్భంగా జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. కార్యక్రమంలో సీపీఐ మండల కార్యదర్శి ఓర్సు రమేష్, తమ్మారపు వెంకటేశ్వర్లు, స్వర్ణ రాయన్న, గుగులోత్ నాగమణి, ఎస్‌కె.రంజాన్‌బీ పాల్గొన్నారు.

కళాభారతిలో సంగీత శిక్షణా తరగతులు



మాస్టర్ జి.తేజస్విని సత్కరిస్తున్న కళాభారతి నిర్వాహకులు

సత్తుపల్లిటౌన్: సత్తుపల్లి కళాభారతిలో ఆదివారం సంగీత శిక్షణా తరగతులు ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా మాస్టర్ జి.తేజస్విని సత్కరించారు. ప్రతి ఒక్కరిలో దాగి ఉన్న కళను వెలికి తీయటానికి సంగీతం ఎంతగానో దోహదపడుతుందన్నారు. ఈ కార్యక్రమంలో సాంస్కృతిక కార్యదర్శి రంగపురి వెంకటేశ్వరరావు, పాటిబండ్ల రామకృష్ణ, పురాలశెట్టి ప్రసాద్, అబీద్ పాల్గొన్నారు.

నియామకం

ఎర్రుపాలెం: రైల్వే ప్రయాణీకుల సంఘం మెంబర్లుగా బీజేపీ నాయకులు నూతక్కి నర్సింహారావు, వుప్పాళ్ల చంద్రమౌళేశ్వరరావు, ముక్కపాటి శ్రీనివాసరావు, దేవరకొండ కోటేశ్వరరావు, రావిరాల అచ్చారావులను సికింద్రాబాద్ రైల్వే డివిజన్ నియమించింది. ఈ మేరకు ఆదివారం ఉత్తర్వులను స్థానిక స్టేషన్ మేనేజర్ వారికి అందించారు.

త్రుటిలో తప్పిన ప్రమాదం



ముదిగొండ సెంటర్ సమీపంలో పక్కకు దూసుకెళ్లిన లారీ

ముదిగొండ: లారీ డ్రైవర్‌కు ఆకస్మాత్తుగా ఫిట్స్ రావడంతో లారీ రహదారిపక్కన ఉన్న దుకాణాల వైపు దూసుకెళ్లిన సంఘటన ముదిగొండలో ఆదివారం చోటుచేసుకుంది. వివరాలు ఇలా ఉన్నాయి. కోదాడ నుంచి ఖమ్మం వైపు వెళ్తున్న లారీ డ్రైవర్‌కు ముదిగొండ ప్రధాన సెంటర్‌కు వచ్చేసరికి ఆకస్మాత్తుగా ఫిట్స్ రావడంతో లారీ రహదారి పక్కకు దూసుకెళ్లింది. రహదారి సూచికతో పాటు సిమెంట్ స్థంబాలకు తగిలి ఆగిపోయింది. త్రుటిలో పెద్దప్రమాదం తప్పింది. పోలీసులు సంఘటన స్థలానికి చేరుకుని వివరాలు సేకరించారు.

అంతా రామమయం..



సీతారామలక్ష్మణ వేషధారణలతో చిన్నారులు

సత్తుపల్లిటౌన్: అయోధ్యలో బాలరాముని దివ్యప్రతిష్ఠ మహోత్సవం సందర్భంగా అంతా రామ నామం జపిస్తున్నారు. ప్రతి ఇంటా పండుగ వాతావరణం నెలకొంది. ఇల్లు, దుకాణాలను ముస్తాబుచేసి శ్రీరాముని జెండాలను ఇళ్లపై ఏర్పాటు చేసి భక్తిని చాటుకుంటున్నారు. అదేవిధంగా వాహనాలపై జైశ్రీరాం అంటూ స్టిక్కర్లు అంటించారు. ప్రత్యేక శోభను సంతరించుకుంది. కొందరు జెండాలను, స్టిక్కర్లను వితరణగా పంపిణీ చేస్తున్నారు. సోమవారం ఆలయాలతో పాటు ఇళ్లలోనూ శ్రీరాముని పూజలు భక్తి శ్రద్ధలతో నిర్వహించేందుకు ఏర్పాట్లలో నిమగ్నమయ్యారు.

సందడిగా దుకాణాలు..

శ్రీసీతారాముల చిత్రపటాలు, పూలు, పూజా సామగ్రి, ఇళ్లపై ఏర్పాటు చేసేందుకు శ్రీరాముని జెండాల కొనుగోలుతో దుకాణాల వద్ద సందడి నెలకొంది. సోమవారం అయోధ్యలో బాలరాముని ప్రతిష్ఠ మహోత్సవాన్ని ప్రత్యక్షంగా వీక్షించేలా రింగ్‌సెంటర్‌లో మాధురి మెడికల్స్ నిర్వాహకులు మానుకోట మధు ఆధ్వర్యాన ఎల్‌ఈడీ స్క్రీన్‌ను ఏర్పాటు చేశారు. శ్రీసీతారాముల పూజలు, భక్తులకు తీర్థప్రసాదాలు అందించేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. అదేవిధంగా పట్టణంలోని శ్రీకోదండ రామాలయం, మెట్టాంజనేయస్వామి ఆలయంతో పాటు ఆలయాలలో భజనలు, ఏకనామ సంకీర్తనలు నిర్వహించనున్నారు. సత్తుపల్లి శ్రీసత్యసాయి సేవాసమితి ఆధ్వర్యాన ఆదివారం సాయంత్రం పట్టణంలో శ్రీసీతారామలక్ష్మణ వేషధారణలతో చిన్నారులు, బాల వికాస్ విద్యార్థులు కలిసి జైశ్రీరాం.. జైజై శ్రీరాం.. శ్రీరామజయరామ జయజయరామ అంటూ గీతాలాపన చేస్తూ ప్రదర్శన నిర్వహించారు.

అరిటాకుపై శ్రీరాముడి చిత్రం..



అరటాకుపై గీసిన చిత్రాలు

సత్తుపల్లిరూరల్: సత్తుపల్లి ప్రభుత్వ బాలుర హైస్కూల్ చిత్రలేఖనం ఉపాధ్యాయుడు ఓలేటి వీనస్ అయోధ్య బాలరాముడి ప్రతిష్ఠ మహోత్సవం సందర్భంగా అరటాకుపై శ్రీరాముడు, హనుమంతుడు, గరుత్మంతుడు, సూర్యభగవానుడు చిత్రాలను గీశారు. ఈ సందర్భంగా పలువురు చిత్రలేఖనం ఉపాధ్యాయుడు వీనస్‌ను అభినందించారు.

మోటార్ సైకిల్ ర్యాలీ..

తల్లాడ: అయోధ్యలో బాల రాముని విగ్రహప్రతిష్ఠ మహోత్సవం సందర్భంగా ఆదివారం తల్లాడలో విశ్వహిందూ పరిషత్ ఆధ్వర్యంలో మోటార్ సైకిల్ ర్యాలీ నిర్వహించారు. స్థానిక హనుమత్ పద్మావతి వేంకటేశ్వరస్వామి ఆలయం నుంచి రింగ్ రోడ్డు మీదుగా నారాయణపురం, మల్లవరం గ్రామాల్లో ర్యాలీ కొన సాగింది.

హనుమాన్ శతక పుస్తకావిష్కరణ

వైరారూరల్: మండలంలోని అష్టగుర్తి గ్రామంలో ప్రసన్నాంజనేయ స్వామి దేవస్థానంలో ఆదివారం ఆలయ చైర్మన్ అమరనేని మన్మథరావు హనుమాన్ శతక పుస్తక ఆవిష్కరణ చేశారు. అయోధ్య ప్రారంభించున్న రామమందిరం వేడుకలను పురస్కరించుకొని ప్రసన్నాంజనేయ స్వామి ఆలయంలో ప్రత్యేక హోమాలు, హనుమా అండశిలుమ, పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో సర్పంచ్ ఐటుకల మురళి, ఉపసర్పంచ్ వెంకటేశ్వర్లు, ఆలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.



హనుమాన్ శతక పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న దృశ్యం

బదిలీలు, పదోన్నతులు చేపట్టాలి



మాట్లాడుతున్న నాగేశ్వరరావు

మధిర: ఉపాధ్యాయుల పదోన్నతులలో ఉన్న ఆటంకాలను పరిష్కరించి వెంటనే పదోన్నతులు, బదిలీలు చేపట్టాలని టీఎస్‌యూటీఎఫ్ ఖమ్మం జిల్లా ప్రధాన కార్యదర్శి పారుపల్లి నాగేశ్వరరావు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఆదివారం స్థానిక టీవీఎం ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో యూనియన్ మధిర మండల మహాసభ జరిగింది. ఈ సభలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడుతూ.. కోర్టులో ఉన్న సమస్యను పరిష్కరించి నిలిచిపోయిన పదోన్నతులను చేపట్టాలని, నూతన పెన్షన్ విధానాన్ని రద్దు చేసి పాత పెన్షన్ విధానాన్ని అమలు చేయాలని కోరారు. అనంతరం యూటీఎఫ్ మధిర మండల ప్రధాన కార్యదర్శి షేక్ నాగూర్ వలీ మహాసభకు సంబంధించిన కార్యదర్శి నివేదికను ప్రవేశపెట్టారు. కోశాధికారి లాల్ అహ్మద్ ఆర్థిక నివేదికను ప్రవేశపెట్టారు. మహాసభల ప్రారంభానికి ముందుగా ఎస్‌టీఎఫ్ఐ పతాకాన్ని ఎం.కస్తూరిబాయి, టీఎస్‌యూటీఎఫ్ పతాకాన్ని ఆర్.లక్ష్మణరావు ఆవిష్కరించారు. ఈ మహాసభలో యూనియన్ నాయకులు రాంబాబు, రంజాన్, నాగరాజు, రామకృష్ణ, తాళ్లూరి ఆంజనేయులు, మీరా ఖాన్, బివి రాజేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.



సంక్షేమ పథకం చెక్కు అందజేస్తున్న ఎమ్మెల్యే రాగమయి

పెనుబల్లి: ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారానికి తన వంతు కృషి చేస్తానని సత్తుపల్లి ఎమ్మెల్యే డాక్టర్ మట్టా రాగమయి అన్నారు. ఆదివారం తెలంగాణ రాష్ట్ర ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్ పెనుబల్లి మండల మహాసభకు ముఖ్య అతిథిగా ఆమె హాజరయ్యారు. అనంతరం ఇటీవల మరణించిన ఉపాధ్యాయులు రామగిరి హనుమంతరావు చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. యూటీఎఫ్ కుటుంబ సంక్షేమనిధికి సంబంధించిన రూ.6 లక్షల చెక్కును హనుమంతరావు కుటుంబానికి అందించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ జిల్లా నాయకుడు మట్టా దయానంద్ విజయ్‌కుమార్, ఆ సంఘం నాయకులు భవాని, జి.నాగమణి, జీవీ నాగమల్లేశ్వరరావు, నరసింహారావు, రామారావు, వీరస్వామి, ప్రసాద్, రంగబాబు, నాగేశ్వరరావు, హనుమంతు, విజయలక్ష్మి, కృష్ణారావు, వెంకటేశ్వర్లు, తిరుపతిరావు తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యే నివాళి..

సత్తుపల్లి: మండలంలోని కాకర్లపల్లిలో నీటి గుంతలో పడి మృతి చెందిన చిన్నారులు కోలా సిద్ధార్థ, ఇసరం వికాస్‌ల మృతదేహాలను సత్తుపల్లి ఎమ్మెల్యే డాక్టర్ మట్టా రాగమయి దయానంద్ ఆదివారం రాత్రి సందర్శించి నివాళులర్పించారు. కుటుంబ సభ్యులను ఓదార్చారు. కార్యక్రమంలో మాజీ ఎంపీపీ వెంకటేశ్వరరావు, ఉమా, సర్వేశ్వరరావు ఉన్నారు.

ఆర్థిక సాయం



ఆర్థిక సాయం అందజేస్తున్న లయన్స్‌క్లబ్ సభ్యులు

కల్లూరు: రోడ్డు ప్రమాదంలో గాయపడిన ఓ వ్యక్తి కుటుంబానికి కల్లూరు లయన్స్‌క్లబ్ అధ్యక్షుడు చలువాది నగేష్ ఆధ్వర్యంలో ఆదివారం రూ.25 వేల నగదు అందించారు. ఇటీవల జరిగిన రోడ్డు ప్రమాదంలో మల్లేల దుర్గారావు గాయపడి చికిత్స పొందుతున్నాడు. అతని ఆర్థిక పరిస్థితిని గమనించిన లయన్స్‌క్లబ్ సభ్యులు విరాళాలు సేకరించి ఆర్థిక సాయం అందించారు. కార్యక్రమంలో లయన్స్‌క్లబ్ సభ్యులు దారా సురేష్, గులివిందల అప్పలనాయుడు, గంగుల నారాయణరావు, ఇందూజు రమేష్, పసుమర్తి రాంబాబు, అనుమోలు శ్రీనివాసరావు, కిన్నెర ఆనందరావు పాల్గొన్నారు.

పేదలకు నిత్యావసరాల పంపిణీ

మధిరరూరల్: మధిర దళిత కాలనీ, బంజారా కాలనీలో నివసిస్తున్న పలు నిరుపేద కుటుంబాల వారికి ఆదివారం లంకా కొండయ్య ఆధ్వర్యంలో దాతల సహకారంతో నిత్యావసరాలు పంపిణీ చేశారు. నాగళ్ల వెంకటేశ్వర్లు, మునగా శ్రీను తదితర కుటుంబాల వారికి దాతల నుంచి సేకరించిన బియ్యం, సరుకులను ఆజాద్ రోడ్‌లో ఉన్న కొండయ్య నివాసంలో కటుకూరి శ్యామారావు, శీలం నరసింహారావు చేతుల మీదుగా పంపిణీ చేశారు. ఈ సందర్భంగా దాత ఆయుష్ ఉద్యోగి కందుల రాంబాబుకి కృతజ్ఞతలు తెలిపారు. అదేవిధంగా ప్రభుత్వ ఉద్యోగిగా విధి నిర్వహణతో పాటు ఖాళీ సమయాల్లో సమాజ సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్న కొండయ్యను ప్రత్యేకంగా అభినందించారు.



నిత్యావసరాలు పంపిణీ చేస్తున్న శ్యామారావు, నరసింహారావు

దుప్పట్లు పంపిణీ

కొణిజర్ల: చేతన ఫౌండేషన్, ఏకం యూఎస్ఏ వారి సహకారంతో మండలంలోని పెద్దరాంపురంలో ఉంటున్న మధ్యప్రదేశ్ వలస కూలీలకు ఆదివారం దుప్పట్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఖమ్మం ప్రధాన కారాగారం జైలర్ కరణం హనుమంతరావు చేతన ఫౌండేషన్ సేవలను కొనియాడారు. ఫౌండేషన్ సభ్యుడు ముత్తినేని సురేష్ మాట్లాడుతూ.. ఫౌండేషన్ ఆధ్వర్యంలో పలు ప్రభుత్వ పాఠశాలల్లో, నిరుపేదమహిళలకు, నిరుపేద విద్యార్థులకు సాయం, దివ్యాంగులకు వీల్‌చెయిర్‌లు తదితర సాయం అందిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో సభ్యులు కిరణ్ బత్తుల ఉపేందర్, వడ్లమూడి సత్యనారాయణ, భువన్, ఈశ్వర్ తదితరులు పాల్గొన్నారు.